క్లుప్తంగా

అయ్యప్పస్వామికి అభిషేకాలు


అభిషేకాలు అందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామి వారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకర నారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉషా క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: క్రీడలతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, బి.వి.రవిశంకర్, ఎస్.జోగినాయుడులు అన్నారు. రాంచీలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఉషా పోటీలకు ఎంపికైన ముగ్గురు క్రీడాకారులను శ్రీకాకుళం జిల్లా ఉషా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధు బుధవారం అభినందించారు. క్రీడాకారులకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

పరామర్శ..


సత్యంనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మధుపాం మాజీ సర్పంచ్ ముగ్గ సత్యంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఎర్నేన ప్రకాశరావు బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో రిటైర్డ్ వీఆర్‌ఓ నల్లి ఆదినారాయణ, ముగ్గ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

అన్నప్రసాదం వితరణ


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ బుచ్చిపేటలోని హరేరామ మందిరంలో సుమారు ఆరు వేల మందికి అన్నప్రసాద వితరణ బుధవారం జరిగింది. మందిరంలో 45 రోజులుగా మండల దీక్షలు చేపట్టారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా 24 గంటల భజన కార్యక్రమం బుధవారంతో పూర్తయిన సందర్భంగా భక్తుల అన్నప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో రెడ్డి శివన్నారాయణ, ఉంగటి శ్రీరాములు, ఢిల్లి నాగేష్, పెంటయ్య, భక్త బృందం పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన లిప్ సభ్యులు


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న లిప్ బృందం సభ్యులు

శ్రీకాకుళం రూరల్: ఒప్పంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను లిప్ రాష్ట్రస్థాయి బృంద సభ్యులు బుధవారం సందర్శించారు. లిప్ సంబంధిత కార్యక్రమాల నిర్వహణతీరు, బోధన, రికార్డులు, విద్యార్థుల సమర్థత వంటి అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట డీఈవో వెంకటరావు, ఏఎంవో లక్ష్మీనారాయణ, ఎస్ఆర్జీలు ప్రవీణ్‌కుమార్, రమేష్‌చంద్ర ఉన్నారు.

వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరి


విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులపై వ్యక్తిగత పర్యవేక్షణ తప్పనిసరిగా చేయాలని రాష్ట్ర అభ్యసన అభివృద్ధి పర్యవేక్షణ బృందం పరిశీలన సభ్యులు ఎస్.శ్రీనివాసరావు అన్నారు. దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం పరిశీలించారు. పాఠశాలలో అమలువుతున్న విద్యా విధానం, సిలబస్ పూర్తి, పాఠ్య ప్రణాళిక, విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్‌ల నిర్వహణ వంటివి పరిశీలించారు. ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు, బృందం సభ్యులు జయకృష్ణ, జె.రవి ఉన్నారు.

భవిష్యత్ తరాల కోసం..
వైఎస్సార్‌సీపీని గెలిపించండి

- చంద్రబాబువి అబద్ధపు హామీలు
- వలంటీర్లకు వందనంలో మంత్రి ధర్మాన


వలంటీర్లనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్/గార: భవిష్యత్ తరాలు బాగుండాలన్నా, సంక్షేమ పథకాలన్నీ మరోసారి అందుకోవాలన్నా ప్రతిఒక్కరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. గార మండల పరిధిలో అంపోలు రోడ్‌లోని సిస్టం కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన శ్రీకాకుళం నియోజకవర్గస్థాయి వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి ధర్మాన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి వారి ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయడం అభినందనీయమన్నారు. గడిచిన ప్రభుత్వ హయాంలో చంద్రబాబు కోటరీ, జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే సంక్షేమ పథకాలు వర్తించేవన్నారు. టీడీపీ జెండా పట్టుకునే వారికే సంక్షేమ పథకాలను వర్తిచేవారని, కలెక్టర్లు సైతం జన్మభూమి కమిటీ సభ్యుడు వద్దకు వెళ్లాలని సిఫార్సు చేయడంతో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని ధర్మాన ఆవేదన చెందారు. ఇలాంటి దుర్మార్గపు పాలనను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తిప్పికొట్టిందన్నారు. అర్హతే ప్రామాణికంగా, ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా, పార్టీలు, జెండాలు చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో విద్యావ్యవస్థలో గతంలో 22వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడు 97 శాతం లిటరసీతో మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రతీ పేదవాడి బిడ్డ కార్పొరేట్ తరహాలో చదువుకోవాలనే ఉద్దేశంతో మనబడి 'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టించారన్నారు. పాఠశాలల అభివృద్ధి, పిల్లలకు మంచి పౌష్టికాహారం, నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. మరికొద్ది రోజుల్లో ప్రపంచంతో పోటీపడేలా ఇంటర్నేషనల్ బాకలారియాట్ (ఐబీ) సీబీఎస్ఈ సిలబస్‌ను కూడా తీసుకువస్తున్నట్లు ధర్మాన వెల్లడించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్యశాఖలో 57 వేల పోస్టులను భర్తీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. టీడీపీ నాయకుడు చంద్రబాబు హామీలన్నీ అబద్ధాలేనన్నారు. అధికార దాహం కోసం చంద్రబాబు కొత్త హామీలతోనూ, మాయ మాటలతోను ముందుకు వస్తున్నారని వాటిని ప్రజలంతా తిప్పికొట్టాలని ధర్మాన కోరారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ.. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులకంటే వలంటీర్లకే ప్రజలు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇంట్లో సొంత మనుషులు ఇవ్వలేని సేవలను వలంటీర్లు అందిస్తున్నారన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని 1700 మంది వలంటీర్లు రానున్న రోజుల్లో సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. తన నియోజకవర్గంలో రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేయడంలో మంత్రి ధర్మాన కృషి అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, డి.పి.దేవ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీలు గొండు రఘురామ్, అంబటి నిర్మల, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, మార్పు సుజాత, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, మండవల్లి రవి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు క్రిష్ణ, పీస గోపి, సాధు వైకుంఠం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన


మాట్లాడుతున్న ఎస్‌డీసీ పద్మావతి

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్న 309 పోలింగ్ కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇంకా ఏమైనా వసతులు కల్పించాల్సి ఉంటే తక్షణమే చేయడం జరుగుతుందని ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల నియమించిన సెక్టర్, మండల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాలు ఏలా ఉన్నాయో స్పష్టమైన నివేదిక కావాలని సూచించారు. పోలింగ్ భవనాల స్థితి, చేర్పులు, మార్పులు చేయాల్సిన అంశాలను పరిగణలోనికి తీసుకోవడం జరుగుతుందన్నారు. సెక్టార్ అధికారులు అందజేసిన నివేదికపై మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల పేరు మార్పులపై రాజకీయ నాయకులు ఇచ్చిన సూచనల ప్రకారం క్షేత్ర స్థాయిలో పర్యటించి మార్చడం జరుగుతుందన్నారు. తహసీల్దార్లు రామారావు, ఆదిలక్ష్మి, శ్యామ్‌కుమార్, ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ ఎన్నికల అధికారులు హేమసుందర్, లింగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


చినరావుపల్లి పోలింగ్ స్టేషన్-7ను పరిశీలిస్తున్న ఎస్సై చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల కోసం పోలీస్‌శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని ఎచ్చెర్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎన్నికలు ఏర్పాట్లులో భాగంగా ఎచ్చెర్ల మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 90 పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నికలు జరిగిన తీరు, గ్రామాల పరిస్థితికి తగిన రీతిలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అధికార యంత్రాంగం అతి సమస్యాత్మక, సమస్యాత్మక, సమస్య తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలు జాబితా సిద్ధం చేస్తోందని, ఈ మేరకు బందోబస్తు, గ్రామాల్లో ముందస్తు చర్యలు ఉంటాయన్నారు. సజావుగా, స్వేచ్ఛగా సామాన్యులు ఓటు వినియోగించుకునే వాతావరణాన్ని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తామన్నారు.

పరిశోధన పత్రాల సమర్పణ


మాట్లాడుతున్న ఉమాకవి, శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: విశాఖ ఆంధ్రాయూనివర్సిటీలో తెలుగు విభాగం, సమైక్య భారతి, ఖర్గపూర్, ఆంధ్రా భవన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ఇరువు కవులు తమ పరిశోధన పత్రాలను బుధవారం సమర్పించారు. సాహితీ చైతన్య కిరణాల అధ్యక్షుడు ఉమాకవి 'తెలుగు భాష నాడు-నేడు' అనే అంశంపై, ప్రముఖ పత్రికాసంపాదకులు, రచయిత జంధ్యాల శరత్‌బాబు తొలి సదస్సులోని మొదటి వక్తగా 'నాటి పత్రికల మేటి భాషాసేవ' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించామని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హోమం


హోమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి నిద్దాలమ్మ తల్లీ మమ్ము కాపాడుమ్మా అంటూ మొక్కలు తీర్చుకుంటాన్నారు. ప్రతి ఏటా మాఘమాసం భీష్మఏకాదశి సందర్భంగా అమ్మవారి యాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మండలం నిద్దాం గ్రామంలో వెలిసిన నిద్దాలమ్మ తల్లి 17వ యాత్ర మహోత్సవాల సందర్భంగా బుధవారం హోమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట


రెండు పతకాలు సాధించిన ఎస్.ప్రమీల


సాధించిన పతకంతో పి.జోగారావు


ఎల్.ప్రసాదరావును అభినందిస్తున్న జాతీయ మాస్టర్స్ సంఘ ప్రతినిధి

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముగ్గురు మాస్టర్ అథ్లెట్స్ పతకాలు సాధించి శభాష్ అనిపించారు. మహారాష్ట్రంలోని పూణే వేదికగా ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు 44వ జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి 10 మంది క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించారు. వీరిలో ప్రమీల, జోగారావు, ప్రసాదరావు పతకాలను దక్కించుకున్నారు. 30 ప్లస్ వయో విభాగంలో ఎస్.ప్రమీల హైజంప్‌లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్‌లో రజతం సాధించారు. అలాగే 40 ప్లస్ వయో విభాగంలో పోల్‌వాల్ట్‌లో కాంస్య పతకం సాధించారు. అలాగే 65 ప్లస్ వయో విభాగంలో ఎల్.ప్రసాదరావు రజత పతకం సాధించారు. పతకాలు సాధించిన మాస్టర్స్ అథ్లెట్స్‌ను మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి పి.సుందరరావు, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ జిల్లా చీఫ్ ప్యాట్రన్ చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా జగదీష్, ప్రతినిధులు జె.భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, యశోద, జ్యోతిరాణి, ఈశ్వరరావు అభినందించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం


వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

జి.సిగడాం: సంతవురిటిలో గల వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం మహోత్సవాన్ని బుధవారం వేకువజామున వైభవంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల సందర్భంగా కల్యాణం చేశారు. ఆలయ ధర్మకర్త బాలబొమ్మ శ్రీనివాసరావు, వేదపండితుల సమక్షంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు


ఎచ్చెర్ల: లావేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


జి.సిగడాం: వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో గ్రామ వలంటీర్లు పాత్ర కీలకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండల కేంద్రం ఆవరణలో వలంటీర్లను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. టీడీపీ ప్రభుత్వం గతంలో జన్మభూమి కమిటీలు వేసి దోపిడీకి తెర లేపిందన్నారు. సీఎం జగన్ మాత్రం వలంటీర్లతో ఇంటింటికీ సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలిచారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అలుపన రమణమ్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చాంధ్ బాషా, ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు జగ్గరోతు తవిటినాయుడు, రాష్ట్ర అర్బన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు, తహసీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం

జి.సిగడాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలన్నారు. ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ ఎర్నేన ప్రకాశరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటి సాయి, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, ఎంపీడీఓ కుచ్చెర్లపాటి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విలువలను అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న ఎల్.ఎల్.నాయుడు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ ఉన్నత విలువలను అలవర్చుకొని ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలని సెట్‌శ్రీ సూపరింటెండెంట్ ఎల్.ఎల్.నాయుడు అన్నారు. స్థానిక విద్యాధరి డిగ్రీ కళాశాలలో జూనియర్ చాంబర్ మెయిన్ సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై బుధవారం జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సమయాన్ని, భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. జేసీస్ అధ్యక్షుడు కూన అనిల్ కుమార్ మాట్లాడుతూ.. అబ్దుల్‌కలాం, గురజాడ అప్పారావుల సేవా స్ఫూర్తిని విద్యార్థులు అలవర్చుకోవాలని చెప్పారు. జేసీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జామి భీమశంకర్ కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ గురించి వివరించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు, అసిస్టెంటు మేనేజర్ కె.వి.రమణ, కళాశాల అధ్యాపకులు వి.టి.నాయుడు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న కార్యదర్శులు

జి.సిగడాం: డీడీఓలుగా అధికారాలు ఇస్తూ జీఓ జారీ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సచివాలయంలో పని చేస్తున్న గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను బుధవారం కలిసి సత్కరించారు. మండల కార్యదర్శుల సంఘం నాయకులు ఎర్నేన జ్యోతి శ్రీనివాస్, చేబ్రోలు సురేష్‌కుమార్, పతివాడ భవాని, సుంకరి భారతి, గార వైదేహి, నాగూర్ బాషా, వై.హరిబాబు, పొగిరి సురేష్, హరీష్, సతీష్, ఎంపీపీ మీసాల సత్యవతి, ఎంపీడీఓ కె.కృష్ణంరాజు ఉన్నారు.

మధురమైనది మాతృభాష


శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరం పాఠశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది


శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న పైడి హరనాథరావు, పక్కనే కళాశాల లెక్చరర్లు


శ్రీకాకుళం రూరల్: తెలుగుతల్లి, గిడుగు పంతులు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రజిని

శ్రీకాకుళం న్యూకాలనీ: అమ్మలాంటి తియ్యనైనది మాతృభాషని శ్రీకాకుళం నగరం హయాతినగరంలో ఉన్న మహాత్మ జ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల సంక్షేమ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మాతృభాష గొప్పతనాన్ని విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు టీచర్ బగ్గు అరుణ, పలువురు ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుభాష ఎంతో విశిష్టమైనది

ప్రపంచంలోనే తెలుగు భాష ఎంతో విశిష్టతను కలిగినదని పైడి హరినాథరావు పేర్కొన్నారు. మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హరినాథరావు మాతృభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అన్ని భాషల సంరక్షనకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, చరిత్ర శాఖాధిపతి డాక్టర్ ఎన్.చిన్నారావు, ఫిజికల్ డైరెక్టర్ ఎ.మోహన్ రాజు, ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు కె.ప్రభాకర్, తెలుగు శాఖా విభాగానికి చెందిన డాక్టర్ కె.జ్యోతిలక్ష్మి, డాక్టర్ కె.గిరిజ, వి.భవాని పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.

మాతృభాషను కాపాడుకోవాలి

శ్రీకాకుళం రూరల్: మాతృభాషైన తెలుగును కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని తెలుగు ఉపాధ్యాయులు పిసిని వసంతరావు అన్నారు. రూరల్ మండలంలోని పాత్రునివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కరణం శ్రీహరి అధ్యక్షతన మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా తెలుగు తల్లి, గిడుగు వెంకటరమణమూర్తి పంతులు చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు డి.సుధామణి, టి.వెంకటరమణమూర్తి, పి.రవి, సుభద్రాదేవి, భాను, వినయ్‌కుమార్, కిషోర్‌కుమార్, వెంకటరమణమూర్తి, సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

మాతృభాషను విస్మరించవద్దు..

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు, యువత మాతృభాషను విస్మరించవద్దని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలో తెలుగు, ఇంగ్లిష్ విభాగాలు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రాథమిక విద్యలో ప్రాంతీయ భాష కీలకమైనదనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగు భాషకు ప్రాధాన్యతనిస్తూ పేద పిల్లలకు ఉపాధి, ఉన్నత భవిష్యత్, ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ఇంగ్లిష్ మీడియాన్ని ప్రభుత్వం పోత్సహిస్తుందన్నారు. తెలుగు సాహిత్యం, విశిష్టత, రచనలు, పద్యాలకు ప్రపంచంలో గొప్పతం ఉందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ తెలుగు భాషా నిష్ణాతులు పర్వతనేని సుబ్బారావు మాట్లాడుతూ 25 వేల ఏళ్ల క్రితం భాషా పరిచయం జరిగిందన్నారు. ఇప్పటికీ లిపి లేని భాషలు ఉన్నాయన్నారు. దేశంలో 1642 భాషలు అమల్లో ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, సహాయ ఆచార్యులు శాంతి, క్లోపల్లి ఉదయ్‌కిరణ్, ఎం.బలరాం నాయుడు, పొందరి లక్ష్మణరావు, పి.రవికుమార్, ప్రముఖ సాహితీవేత్త అల్లంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపస్ ఇంటర్వ్యూలు బుధవారంతో ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన కె.ఎం.వి. ప్రాజెక్ట్సు కంపెనీ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు బీఏ, బీకాం, బీబీఎం, బీబీఏ డిగ్రీ చదివిన 101 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారం రోజుల్లో ఫలితాలు వెల్లడిస్తామని హెచ్ఆర్ మేనేజర్ హరిరాం తెలిపారు. వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్ పర్యవేక్షించారు.